తెలుగు కంటెంట్

# తెలుగుపై ఇతర భాషల ప్రభావం

**1. పారశీక భాష ప్రభావం:**

రాజకీయ, మత, సాంఘిక, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాల వల్ల తెలుగులో పారశీక భాషా పదాలు చేరాయి. పర్షియన్ భాషకు పర్యాయపదం పారశీక భాష. విజయనగర రాజుల కాలంలో మహమ్మదీయ సైనికులు హిందువులతో కలవడం వల్ల సైనిక వ్యవస్థలో అన్య భాషా పదాలు చేరాయి. పారశీక భాష 18వ శతాబ్ది వరకు రాజభాష కాకున్నా స్థానిక ప్రజల వ్యవహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల తెలుగుపై ప్రభావాన్ని చూపింది.

ఆంధ్రదేశంపై మహమ్మదీయులు దండ యాత్రలు చేయకముందే 13వ శతాబ్దిలో తిక్కన భారతంలో త్రాసు అనే పారశీక పదాన్ని రెండుసార్లు ప్రయోగించారు. ఉన్నత పదవుల్లో ఉన్న తెలుగువారు పారశీక, అరబిక్ భాషలను నేర్చుకున్నారు. సామాన్య ప్రజల వ్యవహారం లోనూ పారశీక పదాలను వాడేవారు. పాలనా సంబంధ విషయాల్లోనే కాకుండా వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ పారశీకులకు మహమ్మదీయులపై ఆధిక్యత ఉండేది. వాణిజ్య సంబం ధం వల్ల 'గసగసాలు, ఖరీదు, కిస్మిస్' వంటి పారశీక పదాలు  తెలుగులోకి చేరాయి.

న్యాయశాస్త్రానికి సంబంధించి దాదాపు రెండువేల పారశీక, అరబిక్ పదాలున్నాయని భాషా శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రాచీన కావ్యాల్లో కవులు ప్రయోగించిన దాదాపు తొమ్మిది వందల అన్యదేశ పదాల్లో ఎక్కువ భాగం పారశీక, అరబిక్ పదాలే ఉన్నాయి. సైనికపరమైన సిపాయి, బందూకు, తుపాకీ, ఫిరాయించు, బందోబస్తు, ఫౌజు వంటి పారశీకపదాలు తెలుగులో చేరాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన కౌలు, కుష్కీ, ఫిర్కా పదాలు తెలుగు పదాల్లో కలిసిపోయాయి. సామాన్య జన వ్యవహారంలో వస్తు సామగ్రికి సంబంధించిన కుర్చీ, ఖదరు వంటి పదాలు విరివిగా వినియోగంలో ఉన్నాయి. న్యాయశాఖకు సంబంధించిన దివాను, నకలు, నకాబత్ వంటి పదాలు తెలుగు పదాల్లో మమేకమయ్యాయి. రాజకీయ సంబంధంగా సుల్తాను, పాదుషా, ఫర్మానా, హుజూర్, కితాబు వంటి పదాలు చేరాయి. జన వ్యవహారంలో కలంకారీ, జలతారు, జంబుఖానా, దుకాణం, కౌలు, సిపాయి, ఖూనీ వంటి పారశీక పదాలు వాటి సమానార్థకాలైన దేశ పదాలను వ్యవహారంలో లేకుండా చేశాయి.

**2. ఒడియా భాష ప్రభావం:**

ఒడిశాలో అధికార భాష ఒడియా. తెలుగుకు సమీప భాష అయినందువల్ల ఒడియా ప్రభావం తెలుగుపై ఉంది. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాల మాండలికంలో ఒడి యా పదాలు అనేకం ఉన్నాయి.

ఒడియా భాషలో 13వ శతాబ్దం నుంచే సాహిత్యం ఉంది. సరలదాస్ రామాయణాన్ని, భారతాన్ని ఒడియాలోకి అనువదించారు. 15వ శతాబ్దికి చెందిన చైతన్య, 16వ శతాబ్దికి చెందిన జయదేవుల ప్రభావం ఒడియా సాహిత్యంపై కనిపిస్తుంది. బౌద్ధ, జైన, శాక్తేయ, వైష్ణవ మతాల ప్రభావం ఒడియా సాహిత్యంపై గాఢంగా ఉంది.

తెలుగులో భవంతి, మెల్లా, పైన వంటి ఒడియా పదాలు పూర్తిగా కలిసిపోయాయి. ఉత్తరాంధ్ర మాండలికంలో సాంస్కృతిక ఆదాన ప్రదానాలుగా భోగట్టా, పన్నె (దువ్వెన) రేక, కంబారి వంటి పదాలు ప్రజల వ్యవహారంలో మిళితమయ్యాయి.

**3. మరాఠీ ప్రభావం:**

మహారాష్ట్రలో అధికార భాష మరాఠీ. మరాఠీ భాషా వ్యవహర్తలు దాదాపు 8 కోట్ల మంది ఉన్నారు. మరాఠీలో 12వ శతాబ్ది నుంచి సాహిత్యం ఉంది. ముకుందరాజ్, జ్ఞానదేవ్, తుకారాం, ఏకనాథుడు, కృష్ణ దయార్ణవ, శ్రీధరుడు వంటి ప్రముఖ

రచయితలున్నారు.

మరాఠీ విజాతీయ భాష అయినా, సమీప భాష అయినందువల్ల పాలనా సంబంధంగా పటేలు, పట్వారీ, రాహుతు వంటి మరాఠీ పదాలు తెలుగులో చేరాయి. వ్యాపార సంబం ధంగా కిరాణా, దుకాణం, తోడా వంటి పదాలు తెలుగులో కలిసిపోయాయి. రావు, పంతులు నామవాచక అనుబంధ బిరుదు నామాలు తెలుగులో మమేకమైపోయాయి. దమ్మిడీ, తపేల, పీట, లోటా, డేరా వంటి పదాలకు సమానార్థకాలైన దేశ పదాలను వ్యవహారంలో లేకుండా చేశాయి.

**4. తమిళ భాష ప్రభావం:**

ద్రావిడ భాషా కుటుంబానికి సంబంధించిన తమిళం.. తెలుగు భాషకు సజాతీయ భాష. ద్రావిడ భాషల్లో అతి ప్రాచీనమైన భాష తమిళం. దీనికి తమిఴ , తిరావిడం, అరవం, తముక, ద్రావిడ వంటి పర్యాయపదాలున్నాయి. తమిఴ అంటే మధురమైందని కొందరు భాషాభిమానులు చమత్కరించారు. తిరావిడం అనేది ద్రావిడ పదానికి వికృతి. అరవం అంటే రవం లేనిదని అర్థం. ఆంధ్రులు, కన్నడులు మాత్రమే తమిళభాషను అరవభాషగా పేర్కొ న్నారు.

తమిళ భాషలో మొట్టమొదటి వ్యాకరణ గ్రంథం తొల్కాప్పియర్ రాసిన తొల్కాప్పియం. ఇది క్రీ.శ. మొదటి శతాబ్దంనాటిదని భాషావేత్తల అభిప్రాయం. క్రీ.పూ. 3వ శతాబ్దం నుంచి శాసనాలున్నాయి. క్రీ.శ. మొదటి శతాబ్దం నుంచే తమిళ సాహిత్యం ఉంది. ఆధునిక తమిళకవుల్లో సుబ్రహ్మణ్య భారతి ప్రముఖుడు. ఆయన తెలుగుభాషా మాధుర్యాన్ని గొప్పగా ప్రశంసించాడు. తమిళ భాషా వ్యవహర్తలు దాదాపు 4 కోట్ల మంది ఉన్నారు.

తమిళ భాషా పదాలు భౌగోళిక సంబంధంగా చిత్తూరు, నెల్లూరు జిల్లాల తెలుగు భాషలో ఎక్కువగా చేరాయి. మత సంబంధం గా తిరుపతి, తిరుచూర్ణం, పెరుమాళ్లు, జియ్య ర్ వంటి పదాలు తెలుగు భాషలో కలిసిపోయా యి. భోజన సంబంధంగా భౌగోళిక సాన్నిహి త్యం వల్ల ఇడ్లీ, వడ, సాంబారు, సాపాటు వంటి పదాలు తెలుగు పదాల్లో మమేకమయ్యాయి.

**5. కన్నడ భాష ప్రభావం:**

కర్ణాటకలో అధికార భాష కన్నడం. దీనికి కర్ణాటం, కర్ణాటకం, కన్నడి, కానడి, కేనరీస్ వంటి పర్యాయపదాలున్నాయి. కర్ణాటకను పూర్వం మైసూరు రాష్ట్రం అని పిలిచేవారు.

కన్నడ భాష తెలుగుకు సమీప సజాతీయ భాష. కన్నడ భాషలో క్రీ.శ. 5వ శతాబ్దం నుంచి శాసనాలున్నాయి. క్రీ.శ. 840 ప్రాంతంలో విజయుడు రాసిన కవిరాజ మార్గ అనే గ్రంథం అతి ప్రాచీన లక్షణ గ్రంథం.

పంప–రన్న–పొన్న అనే ముగురు కవులను 'కన్నడ రత్నత్రయం'గా పిలుస్తారు. వీరు జైనమతస్థులు. కన్నడంలో ఆదికవి పంప డు క్రీ.శ. 941 ప్రాంతంలో ఆదిపురాణం, విక్ర మార్జున విజయం (పంపభారతం) అనే గ్రంథాలు రాశాడు. రన్నకవి క్రీ.శ. 993 ప్రాంతంలో అజిత పురాణం, గదాయుద్ధం అనే గ్రంథాలు రాశారు. తెలుగులో వేమన వంటి కవి.. 'సర్వజ్ఞుడు'. కన్నడంలో కుల మాండలికాలు, స్థల మాండలికాలు అనే రెండు భేదాలున్నాయి.

తెలుగుపై కన్నడ ప్రభావం ప్రగాఢంగా ఉంది. తొలిరోజుల్లో రెండింటికీ ఒకే లిపి ఉండేది. వీటి సన్నిహిత సంబంధాన్ని ప్రశంసిస్తూ ఒకేతల్లికి పుట్టిన కవల పిల్లలు అని ప్రముఖ పండితుడు నిడుదవోలు వెంకటరావు వర్ణిం చారు. ఆదికవి నన్నయ కన్నడ రత్నత్రయ భారతం నుంచి పద్యాలను, పద బంధాలను స్వీకరించాడని విమర్శకుల అభిప్రాయం.

మహాకవి శ్రీనాథుడు 'నా కవిత్వంబు నిజము కర్ణాటభాష' అని చెప్పి పండితులకు ఆశ్చర్యం కలిగించారు. తెలుగుభాషతో సన్నిహిత సంబంధం ఉన్నందువల్ల బాడుగ, పుంటికూర, బాలే పండు వంటి కన్నడ పదాలు తెలుగులో చేరాయి. సాంస్కృతిక ఆదానం వల్ల తెలుగులో హంగు, హొయలు, బేడలు, గండరగండ, గండ పెండారం, మజ్జిగె, హాజరు, దేవర వంటి కన్నడ పదాలు జనవ్యవహారంలో మిళితమయ్యాయి. బరిగె, తెరలు, నవురు, నంగనాచి, అడుసు వంటి పదాలు తెలు

గులో కలిసి పోయాయి.

**6. మలయాళ భాష ప్రభావం:**

ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన మలయాళం తెలుగుకు సజాతీయ భాష. దీనికి మలబరీ, మలబారీ అనే పర్యాయపదాలున్నాయి. మలబారీ అంటే కొండల వరుస అని అర్థం. పర్వత ప్రాంతాల్లో ప్రజలు వ్యవహరించే భాష అనే అర్థంలో మలయాళ భాష రూఢమైంది. కేరళలో మలయాళం అధికార భాష. క్రీ.శ. 9వ శతాబ్దం నుంచే  శాసనాలున్నాయి. 13వ శతాబ్దికి చెందిన రామ కథాపాట్టిమ్ (రామచరిత) ప్రసిద్ధ గ్రంథం. 14వ శతాబ్దికి చెందిన లీలా తిలకం ప్రామాణిక వ్యాకరణ గ్రంథం. శంకర్ కురుప్, కేశవ నాయర్, ఉళ్లూర్ పరమేశ్వం వంటివారు ప్రముఖ ఆధునిక కవులు. దక్షిణ ద్రావిడ భాషల్లో మణిప్రవాళ శైలి ఎక్కువగా ఉన్న భాష మలయాళం. తెలుగుపై మలయాళం ప్రభావం చాలా తక్కువ. తమిళంతో మలయాళానికి సన్నిహిత సంబంధం ఉంది.  ఎరిసి వంటి కొన్ని మలయాళ పదాలు తెలుగులో కనిపిస్తాయి. దటాయించు సంశ్లిష్ట క్రియలో దటాణే మలయాళ పదం.

**మాదిరి ప్రశ్నలు**

**1. కిందివాటిలో పర్సో- అరబిక్ భాషలేవి?**

1) అరబిక్- ఉర్దూ- తుర్కీ　　2) పారశీ- హిందీ- ఉర్దూ
3) అరబిక్- తుర్కీ- పారశీక　　4) తుర్కీ-హిందీ- అరబిక్

**2. శ్రీనాథుడు తన కృతిపతుల్లో ఎవరిని పర్షి యన్ - అరబిక్ - టర్కీ భాషలు నేర్చుకున్నాడని ప్రశంసించారు?**

1) వీరభద్రారెడ్డి　　2) బెండపూడి అన్నయమంత్రి
3) అవచి తిప్పయ్యశెట్టి　　4) మామిడి సింగన

**3. తెలుగులో ఎకిమీడు పదానికి మూలమైన పర్షియన్ పదం?**

1) హకీమ్　　2) సర్దార్　　3) వజీర్　　4) షహర్

**4. కిందివాటిలో పారశీక పదం కానిది?**

1) కుర్చీ　　2) త్రాసు　　3) మజుందార్　　4) కుల్లా

**5. కుల్లా-ఖుసి-పంజు-అపరంజి వంటి పార శీక పదాలను కావ్యాల్లో ప్రయోగించిన తెలుగు కవి?**

1) తిక్కన　　2) శ్రీనాథుడు　　3) పోతన　　4) పెద్దన

**6. పారశీక భాష నుంచి ఉర్దూ ద్వారా తెలుగు లో ప్రవేశించిన ఆధునిక కవితా రూపం ఏది?**

1) రుబాయి　　2) గజల్　　3) నానీ　　4) హైకూ

**7. కిందివాటిలో ఒడియా భాష ప్రభావం లేని జిల్లా?**

1) విశాఖపట్నం　　2) శ్రీకాకుళం　　3) గుంటూరు　　4) విజయనగరం

www.sakshieducation.com

8. కింది పదాల్లో మరాఠీ పదం కానిది?
1) చాడి 2) చావడి 3) ఫీ 4) కంబారీ

9. దమ్మిడీ ఏ భాషా ప్రభావంతో వచ్చింది?
1) మరాఠీ 2) హిందీ 3) ఉర్దూ 4) పారశీక

10. బడవా శబ్దానికి మూలమైన మరాఠీ పదం?
1) బాడవా 2) భడవా 3) బాడావ 4) బఢవ

11. వీటిలో తమిళపదం?
1) వంకాయ 2) బీరకాయ 3) తెంకాయ 4) సొరకాయ

12. వీటిలో తమిళ పదం కానిది?
1) తిరుపతి 2) తిరుమల 3) తిరుచానూరు 4) శ్రీకాళహస్తి

13. ఆముక్తమాల్యద పదం చూడుకొడుత్తాళ్ ఏ భాషా పదానికి సంస్కృతీకరణ?
1) మలయాళం 2) తమిళం 3) కన్నడం 4) ప్రాకృతం

14. తెలుగుపై అత్యధిక ప్రభావం గల ద్రావిడ భాష?
1) మలయాళం 2) తుళు 3) కన్నడం 4) తమిళం

15. అన్నమాచార్యులను ప్రభావితం చేసిన కన్నడ వాగ్గేయకారుడు?
1) శివప్ప 2) శ్రీపాదరాయలు 3) పురందరదాసు 4) అరుణగిరినాథుడు

16. గురజాడ కన్యాశుల్కాన్ని కన్నడంలో అనువదించిన రచయిత?
1) ఆర్వీయస్ సుందరం 2) సోమనాథయ్య 3) కందాడై కృష్ణయ్యంగార్ 4) వంజిదగూడ సుబ్బాశాస్త్రి

17. మాలపల్లి నవల, పతాభి ఫిడేలు రాగాల డజను గ్రంథాలను కన్నడంలో అనువ దించిన రచయిత?
1) సోమనాథయ్య 2) ఆర్వీయస్ సుందరం 3) వెంకటరామప్ప 4) యస్.గంగప్ప

18. వీటిలో కన్నడ పదం కానిది?
1) హొయలు 2) మజ్జిగె 3) నవురు 4) పొత్తారు

19. మలయాళంతో సన్నిహిత సంబంధం ఉన్న దక్షిణ ద్రావిడ భాష?
1) తమిళం 2) కన్నడం 3) తుళు 4) కొడగు

20. దక్షిణ ద్రావిడ భాషల్లో మణి ప్రవాళ శైలి ఎక్కువగా ఉన్న భాష?

1) తమిళం 2) మలయాళం 3) కన్నడం 4) తుళు

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1) 3 | 2) 2 | 3) 1 | 4) 3 | 5) 2 | 6) 2 | 7) 3 | 8) 4 |
| 9) 1 | 10) 2 | 11) 3 | 12) 4 | 13) 2 | 14) 3 | 15) 2 | 16) 3 |
| 17) 2 | 18) 4 | 19) 1 | 20) 2 | | | | |

www.sakshieducation.com